గుప్పుమంటున్న గంజాయి



- నిఘా దాటుతున్న 'మత్తు' • చిత్తవుతున్న యువత
- సరిహద్దు రాష్ట్రాల నుంచి జిల్లాకు
- గంజాయి రవాణాపై పోలీసుల సీరియస్
- పెరుగుతున్న కేసులు
- దాడులు కొనసాగుతున్నా ఆగని గుట్కా దందా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పోలీసుల నిఘా, నిరంతర తనిఖీలు ఉన్నా పొరుగు రాష్ట్రాల నుంచి సరిహద్దులు దాటి గంజాయి రవాణా సాగుతూనే ఉంది. జిల్లాలో ఆధునిక పోకడలతో యువత గంజాయి మత్తుకు బలవుతోంది. పోలీసులు నిరంతరం గంజాయిపై సీరియస్‌గా ఉక్కుపాదం మోపుతున్నా కళ్లు గప్పి జిల్లాలో యువతను మత్తులో ముంచుతోంది. కొత్త ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి, గుట్కాను నియంత్రించడానికి పూనుకోవడంతో జిల్లాలో తనిఖీలు కూడా ముమ్మరం చేశారు. జిల్లాలో ప్రస్తుతం ఎస్పీ అఖిల్‌మహాజన్ నేతృత్వంలో గంజాయి మత్తు పదార్థాలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తున్నారు.

• పెరుగుతున్న కేసులు

జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో గంజాయి నియంత్రణపై విస్తృతంగా కరపత్రాలు పోస్టర్‌లు, సదస్సుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. గంజాయి తాగుతున్నట్లు, నిల్వలు ఉన్నట్లు తెలిస్తే సమాచారం అందించే విధంగా అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యార్థుల భాగస్వామ్యంతో పోలీసులు యాంటీ డ్రగ్స్ క్లబ్‌లు ఏర్పాటు చేశారు. ఒక వైపు నియంత్రణపై పెద్ద ఎత్తున చర్యలు చేపట్టినా గంజాయి కేసులు మాత్రం పెరుగుతున్నాయి. 2022 సంవత్సరంలో పోలీసులు 3 కిలోల 733 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని 16 కేసులు నమోదు చేశారు. 54 మందిని అరెస్ట్ చేశారు. 2023 సంవత్సరంలో 70కిలోల 793 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని 59 కేసులు నమోదు చేసి 127 మందిని అరెస్ట్ చేశారు. గడిచిన నెల రోజుల్లో కిలో 250 గ్రాముల గంజాయిని సీజ్ చేసి 13 మందిని రిమాండ్ చేశారు.

• యథేచ్ఛగా గుట్కా దందా

జిల్లాలో నిషేధిత గుట్కాను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో నిషేధం లేకపోవడంతో సిరిసిల్ల జిల్లాకు రవాణా జరుగుతోంది. గుట్కా దందాకు సిరిసిల్ల జిల్లా కేంద్రంగా మారింది. టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో నిత్యం గుట్కా నిల్వలు బయటపడడమే ఇందుకు నిదర్శనం. గుట్కాకు అలవాటు పడిన పేద, మధ్య తరగతి యువతే టార్గెట్‌గా అక్రమంగా గుట్కా అమ్మకాలు సాగిస్తున్నారు.

• కామారెడ్డి మీదుగా రవాణా

సిరిసిల్ల జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్నా కామారెడ్డి నుంచి గుట్కా రవాణా సాగుతోంది. మహారాష్ట్ర నుంచి రైలు మార్గం కామారెడ్డి మీదుగా ఉండడంతో గుట్కా రవాణాకు సులువుగా మారింది. మరోవైపు సిరిసిల్ల జిల్లా చుట్టువైపులా సరిహద్దుల్లో మహారాష్ట్ర గ్రామాలు ఉండడంతో అక్కడ నిల్వ చేసి జిల్లాలోని గ్రామాలకు గుట్కా ప్యాకెట్లను వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు యువకులు గుట్కా ప్యాకెట్లను చిన్న చిన్న గ్రామాల మీదుగా ద్విచక్రవాహనాలు, ఆటోల ద్వారా వెళ్లి దుకాణాల్లో అందిస్తున్నారు. జిల్లాలో గుట్కా ప్యాకెట్లతోపాటు నిషేధిత జర్దా ప్యాకెట్లు కూడా జోరుగా విక్రయిస్తున్నారు.

• పేర్లు మార్చి అమ్మకాలు

జిల్లాలో గుట్కా, అంబర్ వంటి ప్యాకెట్లకు కొత్తపేర్లు పెట్టి విక్రయిస్తున్నారు. గతంలో రూ.5 నుంచి 10 వరకు విక్రయించే గుట్కా, జర్దా ప్యాకెట్లు ఇప్పుడు రూ.15 నుంచి 30 వరకు అమ్ముతున్నారు. ఆర్ఎండీ, ఆర్ఆర్, గోవా, సాగర్ వంటి గుట్కా ప్యాకెట్లకు సినిమా పేర్లు పెట్టి అమ్ముతున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తరచూ గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నా మళ్లీ యథావిధిగా అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి.

• జిల్లాలో సాగుకు బ్రేక్?



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్ (ఫైల్)

జిల్లాలో అటవీ ప్రాంతాల్లో పత్తి, కంది పంటల్లో గంజాయిని అంతర పంటగా సాగు చేసేవారు. పోలీసులు ఎక్సైజ్ అధికారులు నిరంతర దాడులతో సాగు నిలిచిపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా సాగుతోంది. నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి గంజాయి గుట్టు చప్పుడు కాకుండా జిల్లాకు చేరుకుంటోంది. కరీంనగర్, కామారెడ్డి, జగిత్యాల, ప్రాంతాలకు రైలు మార్గం ఉండడంతో రవాణా సులువుగా జరుగుతోంది. దీంతోపాటు ఇతర రాష్ట్రాల్లో నల్లమందుకు సంబంధించిన చాక్లెట్లు కూడా జిల్లాకు వస్తున్నాయి. పోలీసుల తనిఖీల్లో వెలుగు చూశాయి. మరోవైపు గంజాయిని సిగరెట్ల రూపంలో తయారు చేయడమే కాకుండా విక్రయాల్లో కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. చిన్న చిన్న బజ్జీల్లో గంజాయిని దాచి అమ్మినా సంఘటనలు జిల్లాలో వెలుగులోకి రావడం గమనార్హం. గంజాయి రవాణాపై మరింత నిఘా పెంచే దిశగా పోలీసులు దృష్టి సారించారు.

గంజాయి, మత్తు పదార్థాల సమాచారం ఇవ్వండి

- ఎస్పీ అఖిల్‌మహాజన్

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని అందించాలి. వాటి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మేసేజ్ యువర్ ఎస్పీ నంబరు 6303922572కు గానీ డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వవచ్చు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. జిల్లా వ్యాప్తంగా గంజాయి మత్తు పదార్థాల నిర్వహణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మత్తు పదార్థాలు, గంజాయి కలిగి ఉన్నా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

రేపటి నుంచి ఈవీఎంల మొదటి దశ తనిఖీలు



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా తయారీ, సిరిసిల్లలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో ఈ నెల 5 నుంచి ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ చేపట్టనున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవీఎంల తనిఖీలు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈసీఐఎల్, ఇంజనీర్లు, ఆయా పార్టీల నాయకుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. తనిఖీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు కావాలని సరైన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అన్నారు. ఓటరు జాబితా తయారీ అనేది నిరంతర ప్రక్రియని, ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 8న తుది ఓటరు జాబితాను వెల్లడిస్తామని, నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందిస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీప్యాట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం కలెక్టరేట్‌లో ప్రదర్శన కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిందితులకు శిక్షపడినప్పుడే నేరాలు తగ్గుముఖం



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ చంద్రయ్య

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 3: నిందితులకు కఠిన శిక్షపడినప్పుడే నేరాలు తగ్గుతాయని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య అన్నారు. శనివారం సిరిసిల్ల పద్మనాయక కల్యాణమండపంలో పీపీలు, కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గడిచిన నెల రోజుల్లో న్యాయస్థానంలో ఏడు కేసుల్లో నిందితులకు శిక్ష, జరిమానా విధించినట్లు చెప్పారు. సమాజంలో నేరం చేసినవారు శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. పోలీసు, ప్రాసిక్యూషన్ వారు న్యాయవిచారణ చేసి కచ్చితంగా శిక్ష పడేలా చేస్తారన్నారు. క్షణికావేశంలో చేసిన నేరాలపై శిక్షలు తప్పవని అందరు గమనించాలన్నారు. నేర నిరోధన, నేర పరిశోధన అనే అంశాలు విధి నిర్వహణలో అత్యంత కీలకమన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. నేరాల దర్యాప్తు చేసే సందర్భాల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగించుకోవాలన్నారు. ప్రతీ వారం కోర్టు మానిటరింగ్ సిస్టం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌లు ఏపీపీలు వి. లక్ష్మీప్రసాద్, పి.శ్రీనివాస్, సీహెచ్ సందీప్, సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, కరుణాకర్, కృష్ణకుమార్, కిరణ్, శశిధర్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

భక్త మార్కండేయ జయంత్యుత్సవాలకు ఆహ్వానం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3: సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించే భక్త మార్కండేయ జయంత్యుత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సంఘం కార్యవర్గ సభ్యులు ఆహ్వానించారు. శనివారం కరీంనగర్‌లో మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షులు రవి, బాలయ్య, మహిళా అధ్యక్షురాలు కాముని వనితనళినీకాంత్ పాల్గొన్నారు.

ఆటలు ఉపాధికి బాటలు



క్రీడాకారులతో ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 3: ఆటలు ఉపాధికి బాటలుగా మారుతాయని, యువకుత క్రీడలపై దృష్టిసారించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేపాకలో శనివారం ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. ప్రోకబడ్డీ ఎంతోమంది క్రీడాకారుల జీవితాలను మార్చివేసిందన్నారు. యువకులు సమయాన్ని వృథా చేయకుండా ఆటలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. పాఠశాలల్లోనూ చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందన్నారు. ఆటల్లో క్షణికావేశానికి లోనుకావద్దని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. ఎంపీటీసీ కాథ సుమలత మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు దయాసాగర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3: రోడ్డు భద్రతా నియమాలపై సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సేఫర్ ఇండియా రోడ్స్ మిషన్ డైరెక్టర్ ధనుష్మన్ ఓజా నియమాలపై వివరించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రాగి లడ్డూ పంపిణీ

- ప్రయోగాత్మకంగా అమలుకు చర్యలు
- పోత్గల్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ గౌతమి

సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోషణలోపంతో బాధపడుతున్న పిల్లలు, రక్తహీనతతో ఇబ్బంది పడుతున్న గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా రాగి లడ్డూ పంపిణీ చేయడానికి ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టారు. ఈ నెల నుంచి విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు వారానికి ఒక రోజు రాగి లడ్డూ అందించనున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం వెల్లడించారు. ఈ నెలలో వచ్చే ఫీడ్ బ్యాక్‌ను అనుసరించి రాగి లడ్డూ పంపిణీ కొనసాగింపుపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఐదేళ్లలోపు పిల్లలు 35,824 మంది, బాలింతలు 3174మంది, గర్భిణులు 3289మంది ఉన్నారు. వీరికి ఇప్పటికే ఆరోగ్య లక్ష్మీ ద్వారా సంపూర్ణ భోజనం, గుడ్లు, పాలు అందిస్తున్నారు. పోషక లోపాలను నివారించే దిశగా రాగి లడ్డూ అందించనున్నారు.

పోత్గల్ అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

జిల్లాలోని ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో అంగన్‌వాడీ కేంద్రం పనితీరును అదనపు కలెక్టర్ పూజారి గౌతమి శనివారం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బోధన సామర్థ్యాన్ని పరిశీలించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా ఎనేమీయాతో బాధపడుతున్న వారికి రాగి లడ్డూ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించడానికి రాష్ట్ర కార్యాలయం నుంచి అధికారులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, సీడీపీవో అలేఖ్య, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

చందుర్తి, జనవరి 3: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మల్యాలలో శనివారం కృతజ్ఞతా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రజల దీవెనతోనే ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు చెప్పారు. అంతకుముందు అంబేద్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. జడ్పీటీసీ నాగం కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు దొంగరి భూమయ్య, మల్లారపు రాజయ్య, నాయకులు ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం

- గృహాలు, రోడ్లపైకి చేరిన డ్రెయినేజీ నీరు - స్థానికుల ఇబ్బందులు



సర్దార్‌నగర్ రోడ్డుపైకి చేరిన డ్రెయినేజీ నీరు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3: సిరిసిల్ల బల్దియాలో పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యంతో పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలు చెత్తాచెదారం నిండిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం నిండి శనివారం పట్టణంలోని సర్దార్‌నగర్‌లో రోడ్డుపైకి, ఇళ్లు, దుకాణాల్లోకి భారీగా మురికి నీరు చేరింది. సర్దార్‌నగర్, కళాసాగర్ నుంచి పాత బస్టాండ్ శ్రీభవాని హోటల్ వరకు మురికి నీరు రోడ్లపై వరదై పారింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మురికి నీరు పారడంతో దుర్వాసన స్థానికులు, వాహనదారులను ఇబ్బందులకు గురి చేసింది. వర్షాలు కురిసిన ప్రతీసారి వరద రావడంతో వెంకంపేట, అంబికానగర్, అశోక్‌నగర్, అనంతనగర్ సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, పాతబస్టాండ్‌లోని గృహాల్లోకి వరద నీరు చేరుతుండేది. వరదనీరు రాకుండా ఉండే విధంగా అభివృద్ధి పనుల కోసం అప్పటి మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేశారు. సిరిసిల్ల పట్టణం వెంకంపేట నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్ల విస్తరణతో పాటు సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో వెంకంపేట నుంచి పాతబసాండ్ వరకు దాదాపు రూ.2కోట్లతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ(ప్రధాన మురికికాలువ), కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ పారిశుధ్య అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎప్పటికిప్పుడు తొలగించడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో డ్రెయినేజీ మూసుకుపోయి మురికినీరు గృహాలు, దుకాణాలు, రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లింది. ప్రధాన రహదారిలో దుకాణాల యజమానులు డ్రెయినేజీలను మూసివేస్తున్నా కమీషన్లకు ఆశపడుతూ కొంతమంది కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనంతరం స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ పారిశుధ్య యంత్రాంగం మొద్దు నిద్రను వీడి డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగించారు.

మానసిక వేదనతో ఒకరి ఆత్మహత్య

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3: గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లో నివసముండే శ్రీపతి నరేష్(37) అనే వ్యక్తి మానసిక వేదనతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అతనికి భార్య జ్యోత్స్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేసిన నరేష్‌కు మానసిక స్థితి సరిగా లేక పోవడంతో ఎర్రగడ్డ మెంటల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కొన్ని రోజులుగా తాను చనిపోతానని అంటుండేవాడని, శనివారం ఉరి వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సమ్మయ్య పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3 : కరీంనగర్ గాంధీరోడ్ ప్రాంతంలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్న 8 మందిని ఒకటో టాణా పోలీసులు అరెస్టు చేశారు. ఒకటో టాణా ఎస్ఐ రవి ఆధ్వర్యంలో శనివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన 8 మంది వద్ద నుంచి 49,580 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

ఎలిగేడు, ఫిబ్రవరి 3: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధూళికట్ట గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు కట్కోజుల రామ్మూర్తి(55), కొడుకు సుబ్రమాణ్యం(25)లకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. తండ్రికొడుకులు కరీంనగర్ ఆసుపత్రికి వెళుతుండగా సుల్తాన్‌పూర్‌లో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. కాగా డెంగ్యూతో బాధపడుతున్న సుబ్రమాణ్యం ఆసుపత్రికి వెళుతున్న తరుణంలో ప్రమాదంలో గాయపడ్డారు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

తెలంగాణ ఎన్టీపీసీ 2వ యూనిట్
ట్రయల్ రన్ సక్సెస్

● 800 మెగావాట్ల ఫుల్ లోడ్‌కు చేరిక
● త్వరలో కమర్షియల్ ఆపరేషన్ ప్రకటన



ట్రయల్ రన్ సందర్భంగా ఈడీ, అధికారులు

జ్యోతినగర్, ఫిబ్రవరి 3 : ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) స్టేజ్ 1 పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. ప్రాజెక్టులోని 800 మెగావాట్ల 2వ యూనిట్‌కు నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. గత బుధవారం రాత్రి యూనిట్‌కు సంబంధించి ట్రయల్ రన్ చేయగా 72 గంటలపాటు కొనసాగిన ట్రయల్ రన్ సక్సెస్ అయింది. శనివారం రాత్రి 9.20 గంటలకు యూనిట్లో 800 మెగావాట్ల ఫుల్ లోడ్‌కు చేరుకుంది. ట్రయల్ రన్ చివరి దశను ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. యూనిట్ ఫుల్ లోడ్‌కు చేరుకోవడం, ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఈడీ కేదార్ రంజన్ టిఎస్‌టిపిపి అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఈడీ, అధికారులు ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో జీఎం సంజీవ్ కుమార్ సాహా, జీఎం జి.బి.సురేష్, జీఎం సంతోష్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మానకొండూర్, పిబ్రవరి 3: మానకొండూర్‌లో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన కనుకయ్య అతని తల్లితో కలిసి శనివారం వీణవంక మండలంలోని జంగంపల్లి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మానకొండూర్‌లో కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తున్న కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. ప్రమాదంలో తల్లి, కుమారుడికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఓ ఆటో శుక్రవారం స్టాపర్ బోర్డును ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానిపేటకు చెందిన ఆటో డ్రైవర్ నరేష్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భవానిపేటకు చెందిన నరేష్‌గౌడ్ తన ఆటోను నడుపుతూ అక్కడ నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న క్రమంలో రోడ్డుపై ఉన్న స్టాపర్ బోర్డును అతివేగంగా ఢీకొట్టాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ముగ్గురు వ్యక్తుల బైండోవర్

ఎల్లారెడ్డిపేట ,ఫిబ్రవరి 3: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. మండలంలో ఇటీవల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి వేళలో గస్తీకాస్తున్న తమ పోలీస్ సిబ్బందికి బొప్పాపూర్, కోనరావుపేట గ్రామాలకు చెందిన బొమ్మన వేణి భరత్, బొండ్ల గణేష్, పని అఖిల్‌లు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకొని విచారించి తహసీల్దార్ రాంచంద్రం ఎదుట హాజరు పరిచామని చెప్పారు. రాత్రివేళలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై రమాకాంత్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

రుద్రంగి, ఫిబ్రవరి 3 రుద్రంగి మండల కేంద్రం శివారులోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన గడ్డం లక్ష్మణ్ అనే వ్యక్తి పెట్రోల్ పంపు నుంచి బైక్‌పై బయటకు వస్తుండగా యూపి రాష్ట్రానికి చెందిన ఇద్దరు కూలీలు రుద్రంగి నుండి కోరుట్ల వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఎదురెదురుగా ఢీకొన్న సంఘనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలు కావడంతో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 3: మండలంలోని సిర్సపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం శనివారం లభ్యమైనట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొని వస్తుండటంతో గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించారు. తనిఖీ చేయగా మృతుడు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఆర్.శశిధర్‌గౌడ్(40)గా గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రమాదవశాత్తూ తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు సుద్దాల కొండయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కొండయ్యను స్థానికులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆరుగురు మందుబాబులకు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 3: సిరిసిల్ల పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురు మందుబాబులకు రెండు రోజులు జైలు శిక్షతో పాటు జరిమానా, మరో 9మందికి జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ శనివారం తీర్పు వెల్లడించారని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో గత 15రోజుల వ్యవధిలో పోలీసుల తనిఖీల్లో 15మంది మందుబాబులు పట్టుబడ్డారన్నారు. వీరికి కౌన్సిలింగ్ ఇచ్చి మరెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించామన్నారు. అనంతరం వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా ఆరుగురు మందుబాబులకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 3వేల జరిమానా, మరో 9మందికి ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న గిరిజనులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3: పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులపై గత ప్రభుత్వంలో అటవీశాఖ అధికారులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని లంబాడీల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గిరిజనులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనరావుపేట మండలం జైసేవాలాల్ తండాలో సుమారు 64 మంది గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. అక్రమ కేసుల్లో కోర్టుకు వెళ్లడానికి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం సర్వే నిర్వహించి కొందరు గిరిజనులకు పట్టాలు ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడంతో గందరగోళం ఏర్పడి కేసుల వరకు వెళ్లిందన్నారు. ప్రజాపాలనంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడీల ఐక్య వేదిక, గిరిజన నాయకులు మధూకర్‌నాయక్, భూక్యా నాయక్, రంజీనాయక్, గిరిజన మహిళలు లక్ష్మిబాయ్, చాంకిబాయి, కైకాబాయి, కవిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటాలి

● డీవైఎస్‌వో కీర్తిరాజవీరు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు విశేష ప్రతిభ చాటి రాష్ట్ర చాంపియన్లుగా నిలవాలని డీవైఎస్‌వో కీర్తిరాజవీరు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా రగ్బీ జట్టు అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇటీవలి కాలంలో రగ్బీ క్రీడకు మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు వివిధ క్రీడాంశాలలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడా పతాకాన్ని ఎగురవేస్తుండడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఈనెల 4,5 తేదీల్లో యాదాద్రి జిల్లా భువనగిరిలో జరుగబోయే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.చిరంజీవాచారి, రంగు నిరంజన్, గౌరవ అధ్యక్షుడు కొరిమి సంతోష్, పిఈటి శివ తదితరులు పాల్గొన్నారు.

ఒబులాపూర్‌లో చోరీ



బీరువా పగులగొట్టి చిందర వందర చేసిన వస్తువులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3:తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామంలో బత్తుల నర్సయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువా పగులగొట్టి రూ.30 వేల నగదుతో పాటు 60 తులాల వెండి అభరణాలతో పాటు 5 గ్రాములు బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



సంగీత కచేరి చేస్తున్న లత, తిరుమల బృందం



నాటిక ప్రదర్శన

వేములవాడ, ఫిబ్రవరి 3: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. చివరి రోజు ఉదయం ఎం.వి. సింహాచలశాస్త్రి భాగవతార్ హరికథ వినిపించగా, లత, తిరుమల, శ్రీలత, పద్మలత, వెన్నెల, మాలతి, వాణి సంగీత కచేరి నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీరాం భట్టార్ భాగవతార్ హరికథ గానం చేయగా, సాయంత్రం రాఘవేందర్ తబలపై సోలో కచేరీ నిర్వహించారు. అనంతరం హరిప్రియ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. రాత్రి ఎస్. శ్రీనివాస్ ఏకపాత్రాభినయం చేయగా, చివరగా శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి వారు శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

భూమిని రక్షిస్తేనే భవిష్యత్తు : ఈషా ఫౌండేషన్ ప్రతినిధి సుసాన్

వేములవాడ: భూమిని రక్షించుకుంటేనే మనందరికీ భవిష్యత్తు ఉంటుందని ఈషా ఫౌండేషన్ ప్రతినిధి, నెదర్లాండ్స్‌కు చెందిన సుసాన్ సమాధానం అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలకు శనివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం భూమిలో నేల సారం కోల్పోతున్న విషయం మనం గ్రహించలేకపోతున్నామన్నారు. భూమిని రక్షించడం, సారాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- వేములవాడలో ప్రైవేట్ లాడ్జీలు, తనిఖీలు

వేములవాడ, ఫిబ్రవరి 3: ప్రైవేట్ లాడ్జిలు, అద్దె గదుల నిర్వాహకులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని వేములవాడ పట్టణ సిఐ కరుణాకర్ అన్నారు. శనివారం వేములవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో కలిసి ఆయన ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గదులు అద్దెకు ఇచ్చే సమయంలో కచ్చితంగా ఫొటో గుర్తింపు కార్డు కలిగివున్న ఆధార్ ఇతరత్రా వాటిని జిరాక్స్ రూపంలో తీసుకొని నెలరోజుల వరకైనా భద్రపరచాలని చెప్పారు. రికార్డులో కూడా వారి పూర్తి వివరాలు సెల్ నెంబర్‌తో సహా నమోదు చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పని చేసేలా చూసుకోవాలన్నారు. వ్యాపార సముదాయాలు కూడా ఇదే తరహాలో ఏర్పాటు చేయాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో సిఐలు కృష్ణకుమార్, కిరణ్‌కుమార్, ఎస్సైలు ఉన్నారు.



అద్దె గదులను తనిఖీ చేస్తున్న పోలీసులు

రేపు రేకుర్తిలో మెల్లకన్నుకు చికిత్స

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 3: నగరంలోని రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్ల కన్నుకు చికిత్స కోసం 5వ తేదీ సోమవారం ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉంటారని రేకుర్తి ఆసుపత్రి ట్రస్టు సభ్యుడు కోల అన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మెల్లకన్ను, చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, చిన్న పిల్లల్లో శుక్లం (మోతెబిందు) చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు సేవలు అందిస్తారన్నారు. హైదరాబాద్‌లో దొరికే సేవలు తక్కువ ఖర్చుతో కరీంనగర్‌లో పొందడానికి 7673983940 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3: కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-1 బోధించుటకు రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ, పీజీ ఉత్తీర్ణత శాతం, బోధన అనుభవం నెట్/సెట్ అర్హత కలిగిన అభ్యర్థులను సోమవారం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయంలో వారధిలో దరఖాస్తు చేసుకుని సోమవారం 5వ తేదీన నిర్వహించే రాత పరీక్షకు, డెమో, ఇంటర్వ్యూకు ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు.

కాంగ్రెస్ పాలన ఉన్నా.. లేకున్నా ఒక్కటే

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు

మల్యాల, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఉన్నా లేకున్నా ఒకటే అని గతంలో 56 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని ఇప్పుడు కూడా న్యాయం చేయదు అని, ప్రజలు కూడా నమ్ముతున్నారని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సి.మల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం విలేఖరులతో మాట్లాడారు. 50 రోజుల కాంగ్రెస్ పాలనలో 50 వేషాలు వేశారని ముందు రోజుల్లో కూడా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరుగదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాకే రాష్ట్రంలో దేవాలయాలు అభివృద్ధికి నోచుకున్నాయని అందులో భాగంగానే కొండగట్టు అభివృద్ధికి రూ.100కోట్లు విడుదల చేయడంతో పాటు మరో 500 కోట్లు మంజూరు చేశారని ప్రస్తుత ప్రభుత్వం అవి విడుదల చేసి గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 16 ఎంపీ స్థానాలు గెలుపొందాలని అంజన్నకు మొక్కుకున్నట్లు మల్లారెడ్డి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీటీసీ రామ్మోహన్‌రావు, విండో చైర్మన్ సాగర్‌రావు, డైరెక్టర్ కొంక నర్సయ్య ఉన్నారు.

● అంజన్నకు పూజలు

కొండగట్టు అంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆలయ అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అధికారులు శాలువాతో సత్కరించారు. అయితే ఆలయంలోకి మల్లారెడ్డి వచ్చినప్పుడు ఆయన వెంట గన్‌మెన్ ఆయుధంతో రావడం వివాదాస్పదంగా మారింది. గన్‌మెన్ ఆయుధంతో ఆలయంలోకి రావడం పట్ల ఆలయ సిబ్బందితో పాటు పలువురు వారించినప్పటికీ అలాగే ఉండడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేశారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు



ధర్మపురిలో భక్తుల క్యూలైను

మల్యాల, ఫిబ్రవరి 3: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధి శనివారం భక్తులతో కిక్కిరిసింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ఇరవై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్ ఇతర అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి : ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల వద్ద లోక క్షేమార్థం నరసింహ హోమం జరిపారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

వీడని వృద్ధురాలి మిస్సింగ్ మిస్టరీ

● పదినెలలుగా కొనసాగుతున్న విచారణ



లింగవ్వ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 3: ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన బత్తుల లింగవ్వ (63) అనే వృద్ధురాలు అదృశ్యమై పదినెలలు గడిచింది. గతేడాది మే 12వ తేదీన అదృశ్యమైనట్లు ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. దీనిపై పదినెలలుగా విచారణ కొనసాగుతోంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరుకు చెందిన బత్తుల లింగవ్వ భర్త లింగయ్య రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. లింగవ్వకు సంతానం కాకపోవడంతో లింగయ్య రెండో పెళ్లి చేసుకోగా వారికి ఓ కూతురు ఉంది. అయితే రెండో భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. రెండో భార్య మరణించడానికి ముందే లింగయ్య తనకు వంశపారంపర్యంగా వచ్చిన 1.20 ఎకరాల భూమిని మొదటి భార్య లింగవ్వకు 20 గుంటలు, రెండో భార్యకు 20 గుంటలు, ఆయన పేరిట 20 గుంటలు మార్పిడి చేసుకున్నాడు. లింగయ్య తన 20 గుంటల భూమిని అవసరాల రీత్యా విక్రయించుకోగా రెండో భార్య పేరిట ఉన్న 20 గుంటలు ఆమె కూతురు పేరిట మార్పిడి జరిగింది. లింగవ్వ అదృశ్యానికి ముందు ఆమె పేరిట ఉన్న 20గుంటల భూమి రూ.15 లక్షలకు విక్రయ ఒప్పందం చేసుకుంది. ఈ విక్రయ ఒప్పందంలో భాగంగా రూ.2 లక్షలు అడ్వాన్సుగా తీసుకుంది. మిగతా డబ్బులు మరో మూడు రోజుల్లో తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఇంతలోనే లింగవ్వ అదృశ్యం కావడం స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లింగవ్వ అదృశ్యం విషయమై ఆమె అక్కలు ఎస్పీని కలిసి న్యాయం చేయాలని కోరారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3: క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజేందర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని అన్నారు. రాష్ట్రంలోని ఎనిమిది ఉమ్మడి జిల్లాల నుంచి 150 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాలల పీడీ అంతటి శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, హరికిషన్, శ్రీలక్ష్మి, పూదరి రమేశ్, బి.రాజగోపాలాచారి, చిరంజీవి, వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన కోచ్‌మేనేజర్లు పాల్గొన్నారు.

బాల నేరస్తులను గుర్తించేందుకు జిల్లా జైలులో తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3: పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ శనివారం జిల్లా జైలును తనిఖీ చేశారు. 18 నుంచి 22 సంవత్సరాల వయస్సు కలిగిన విచారణ ఖైదీల జనన ధ్రువీకరణ పత్రాలను సేకరించి విచారించారు. ఈ సందర్భంగా 18 నుంచి 22 సంవత్సరాల వయసు కలిగిన విచారణ ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్యంలో సత్ప్రవర్తనతో మెదలాలని, నేరాలకు పాల్పడకుండా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిండెంట్ సమ్మయ్య, జైలర్ శ్రీనివాస్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్‌లు పాల్గొన్నారు.

ఇండో-నేపాల్ కరాటే పోటీలు ప్రారంభం

● 20 రాష్ట్రాల క్రీడాకారుల హాజరు



మాట్లాడుతున్న జిల్లా కాయ్ చైర్మెన్ చల్ల హరిశంకర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3: గోజుర్యూ కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండో-నేపాల్ కరాటే పోటీలు శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ఘణంగా ప్రారంభమయ్యాయి. నేపాల్‌తో పాటు మన దేశంలోని 20 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(కాయ్)చైర్మెన్, రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. కరాటే రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీలను నిర్వహించడం అభినందనీమన్నారు. పోటీల నిర్వాహకులు సురభి వేణుగోపాల్, సురభి అన్వేష్‌లు మాట్లాడుతూ నేపాల్ దేశంతోపాటు ఆదేశంలోని 20 రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటనున్నారని అన్నారు. క్రీడాకారులకు పటాస్, కుమిటి, వెపన్, టీమ్‌కటాస్, అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి కీర్తి రాజవీరు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, పోటీల చీఫ్ జ్యూరీ, నేపాల్ కరాటే ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ బీర్‌మిత్ర, గోజుర్యూ కరాటే ఫెడరేషన్ ఇండియా చీఫ్ నాగేశ్వర్‌రావు, కాయ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈ శ్రీనివాస్, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు బి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర సభ్యులు కె వసంత్‌కుమార్, గోపు రాజిరెడ్డి, పుల్లూరి శ్రీనివాస్, వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన కరాటే మాస్టర్లు సత్యశంకర్, మొండయ్య, ప్రసన్న, శ్రీనివాస్, చందర్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై అధికారుల విచారణ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3: చింతకుంట గురుకుల కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య ఘటనపై అధికారులు శనివారం విచారణ నిర్వహించారు. డిసిపిఓ శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్1098 జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్‌లు జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు గురుకుల కళాశాలను సందర్శించారు. సోమవారం రాత్రి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ప్రిన్సిపాల్, అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. శనివారం కళాశాలలో విద్యార్థులు లేనందున మళ్లీ ఒకసారి కళాశాలను సందర్శించి విద్యార్థుల నుండి వివరాలు సేకరించి నివేదికను పైఅధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాస్మిన్ థెరిసా, బాలల పరిరక్షణ పథకం సోషనల్ వర్కర్ కవితదేవి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ సాయికిరణ్, లెక్చరర్స్, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 3: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన అజీమ్‌పాషా (19) చెట్టుకు ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదవ తరగతి ఫెయిల్ కావడంతో కొంత కాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతూ వచ్చాడు. ఏం చేయాలో పాలుపోక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

7 నుంచి 15 వరకు ప్రత్యేక డ్రైవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ఈ నెల 7 నుంచి 15 వరకు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ములుగు జిల్లా నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందని, ముఖ్యంగా రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. ప్రత్యేక డ్రైవ్‌లో గ్రామంలో శానిటేషన్‌తోపాటు, తాగునీరు, మౌలిక సదుపాయాలు, ఉపాధి హామీ తదితర కార్యక్రమాల పరిశీలన, సమస్యలతోపాటు, 15న గ్రామ ప్రజలు, మహిళా సంఘాలు, యువకులతో సమావేశం ఏర్పాటు చేసి సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాలన్నారు. మహిళా సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి ఆదాయం వచ్చే మార్గాలను గుర్తించాలని, వారు అభివృద్ధి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో బాగా పనిచేసిన వారిని గుర్తించి కలెక్టర్ ద్వారా సన్మానించాలన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అధికారులకు వెంటనే ఒకరోజు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, గ్రామాలలో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీనివాస్, టెక్స్‌టైల్ ఏడీ సాగర్, మిషన్‌భగీరథ అధికారులు పాల్గొన్నారు.

● వేసవిలో తాగునీటి సమస్య రానివ్వద్దు

రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య రానివ్వద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిన సందర్భంగా జిల్లాలోని ఉన్నతాధికారులతో శనివారం సమీ కృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి శుద్ధి నుంచి మొదలు ఇంటింటికీ సరఫరా అయ్యే దాకా తలెత్తే సమస్యలపై తనిఖీ చేయాలని, నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 3: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరుతామని వేములవాడ శాసన సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో జరిగిన వేములవాడ పట్టణ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. వేములవాడ నియోజక వర్గంతోపాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంతోపాటు వేములవాడ పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన వీటీడీఏ సమావేశం నిర్వహించామని, వేములవాడ అభివృద్ధికి 30 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని, త్వరలోనే అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ లభించే విధంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ఏ ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే విధంగా కృషి చేయాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో తన గెలుపు కోసం కష్టపడిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని, అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, మున్సిపల్ కౌన్సిలర్ బింగి మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్వాసితుల కోసం ఇండస్ట్రియల్ కారిడార్

వేములవాడ టౌన్: మధ్యమానేరు నిర్వాసితుల కోసం మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని, నిర్వాసితులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ కష్టకాలంలో నిలబడిన కార్యకర్తలకు ప్రాధన్యం ఉంటందన్నారు. అర్బన్ మండలంలో 11 ముంపు గ్రామాలు కావడంతో నిర్వాసితుల పరిస్థితి తనకు తెలుసన్నారు. నిర్వాసితులను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తానన్నారు. నిర్వాసితులకు గత ప్రభుత్వం ఇస్తానని మాట తప్పిన రూ. 5 లక్షల 4 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా అర్హులైన నిర్వాసితులకు ఇల్లు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆరెపల్లి నుంచి నందికమాన్ చౌరస్తా వరకు నాలుగు లైన్ రోడ్డును మంజూరుకు కృషి చేస్తానన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు ఇప్పటికే పలు శాఖల అధికారులతో సమావేశమై అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి ప్రైవేటు కంపనీల ఏర్పాటుకు అధిష్ఠానంతో మాట్లాడి నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తానన్నారు. ఎంపీ ఎన్నికలు సమీస్తున్నాయని, కార్యకర్తలు సైనికుళ్ల పని చేయాలని సూచించారు. గ్రామాల్లో కాంగ్రెస్ బలగాన్ని మరింతగా పెంచాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, జిల్లా నాయకులు చింతపెల్లి శ్రీనివాస్‌రావు, ముడికే చంద్రశేఖర్‌యాదవ్, సర్పంచ్‌లు పండుగు ప్రదీప్, కదిరే రాజుకుమార్ నాయకులు ఎర్రం ఆగయ్య, వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, కత్తి కనుకయ్య, మారవేని రాజ్‌కుమార్, ఎర్రం సత్తయ్య ఆయా గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలలో వైట్ కలర్ డే



రంగంపేట పాఠశాలలో వైట్ కలర్ డే వేడుకల్లో విద్యార్థులు

వీర్నపల్లి, ఫిబ్రవరి 3 : వీర్నపల్లి మండలంలోని రంగంపేట మండల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం వైట్ కలర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుపు రంగు దుస్తులు ధరించారు. అదే రంగులో ఉండే వివిధ రకాల పువ్వులు, కూరగాయలు తీసుకొచ్చి తెలుపు రంగు గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎస్ఐ ముద్ర ఉన్న వస్తువులనే ఉపయోగించాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3: దేశంలో నేటికి నకిలీ వస్తువులు చలామణిలోకి వస్తున్నాయని, ఐఎస్ఐ ముద్ర ఉన్న వస్తువులనే ఉపయోగించాలని బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్స్ (బీఐఎస్) కో- ఆర్డినేటర్ ప్రభాకర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ప్రధానోపాధ్యాయిని శారద, ఉపాధ్యాయుడు దోర్నాల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి ఆత్మీయ సన్మానం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3: తంగళ్లపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సిరిసిల్ల ప్యాక్స్ వైస్ ఛైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పడిగెల మానసరాజు హాజరయ్యారు. తాజా మాజీ సర్పంచ్ అంకారపు అనితరవీందర్, ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతి, వార్డు సభ్యులు సల్లంగుల బాలకృష్ణ, క్యారం జగన్, కోడం భవితసుధాకర్, రెడ్డి పర్శరాములు, గజభీంకార్ లాస్యప్రవీణ్, నేరేళ్ల పుష్పలతనర్సింగం, అంకారపు లక్ష్మీ వైకుంఠం, కలికోట కాశీచరణ్‌రాజ్, తదితరులను సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు ఎడమల శ్రీధర్‌రెడ్డి, యూత్‌క్లబ్ అధ్యక్షుడు అసాని జనార్దన్‌రెడ్డి, నాయకులు కందుకూరి రామాగౌడ్, రాపెల్లి అనందం, సద్ద రోజా, మచ్చ శ్రీనివాస్, ఎడమల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకే శిబిరాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3: జిల్లాలోని అన్ని గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించేందుకే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి శ్రీరాములు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 7 బృందాలు ఇంటింటా తిరుగుతూ జ్వర సర్వేను నిర్వహించాయి. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శిబిరం ఏర్పాటు చేసి 158 మందికి వైద్య పరీక్షలు చేశారు. 14 మంది రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులను వృథా చేసుకోకూడదని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. డెంగ్యూ లక్షణాలు ఎవరికీ లేవని నిర్ధారించారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి స్రవంతి, వైద్య సిబ్బంది పద్మ, లక్ష్మీప్రసన్న, స్వప్నదేవీ, కమల, ప్రవీణకుమారి, అమృతవల్లి, సుమలత, రమేశ్, పద్మ, శాంతి, సునీత, మౌనిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు హంగామా

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని రాచర్ల జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలను మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అదిరేటి స్టెప్పులతో హంగామా చేశారు. నృత్యాలు ఆద్యంతం అలరించాయి. ఆటా,పాటలతో ఉర్రూతలూగించారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వక్తలు ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు ఆందోళనలకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు సంసిద్ధులు కావాలన్నారు. ప్రణాళికబద్ధంగా ముందుకు సాగి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, పిల్లల వైద్యుడు సురేంద్రబాబు, గాయత్రీ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్‌రావు, కళాశాల డైరెక్టర్ రాజయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం పాదయాత్ర

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3: ముగ్గురు వ్యక్తులు తనను మోసం చేశారని, న్యాయం కోసం సిరిసిల్ల నుంచి మానవహక్కుల కమిషన్ కార్యాలయం వరకు న్యాయ పోరాట నిరసన పాదయాత్ర చేపట్టినట్లు బాధితుడు మిట్టపెల్లి శ్రీకాంత్ తెలిపారు. శనివారం పాదయాత్రగా వచ్చిన శ్రీకాంత్ తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనతోపాటు మరికొంతమందితో లగిశెట్టి శ్రీనివాస్, గుంటుక మహేష్, ఏలూరి రవికిరణ్ పనులు చేయించుకోని వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపాడు. మనస్తాపం చెంది గతంలో అత్మహత్యకు యత్నిస్తే పోలీసులు, బంధువులు అడ్డుకున్నారని పేర్కొన్నాడు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అర్థికంగా ఉన్నవారి పక్షాన నిలుస్తూ తమకు న్యాయం చేయడం లేదని, న్యాయం కోసం మానవ హక్కుల కమిషన్ ఆశ్రయిస్తున్నట్లు తెలిపాడు.

రేషన్ దుకాణాలను రద్దు చేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3: సిరిసిల్ల పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రేషన్ దుకాణాలను రద్దు చేయాలని శనివారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ సిరిసిల్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ నిబంధనాలకు విరుద్ధంగా రేషన్ దుకాణాలను మహిళా పొదుపు సంఘాలు బినామీ పేర్లతో నడిపిస్తున్నారన్నారు. ఎమ్మెస్ బజార్, మజ్దూర్ అడిట్, అకౌంట్స్ సభ్యులు లేకుండా రేషన్ దుకాణాలను నడిపిస్తున్నారని ఆరోపించారు. కొన్ని రేషన్ దుకాణాలలో ఈ పాస్ మిషన్‌తో డీలర్ వేలు ముద్ర కాకుండా వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేర్ల మీద నడిపిస్తున్నారని ఒక రేషన్ దుకాణంలో అంగన్‌వాడి టీచర్ వేలు ముద్రతో కూడా ఈ పాస్ మిషన్ నడుస్తోందని పేర్కొన్నారు. నిబంధనాలకు విరుద్ధంగా అక్రమంగా రేషన్ దుకాణాలను నడిపిస్తున్న వారితోపాటు సహకరిస్తున్న అధికా రులపై చర్యలు తీసుకోవాలని, అర్హులకు దుకాణాలు కేటాయించాలని కోరారు.



సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్

టీ హబ్‌కు అవార్డు హర్షణీయం

సిరిసిల్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రం (టీహబ్)కు రాష్ట్రంలో ఉత్తమ సేవల విభాగంలో ప్రథమ స్థానం అవార్డు రావడం హర్షణీయమని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 2023లో 79,353 మంది రోగులకు 2,54,410 రకాల వైద్య పరీక్షలు చేసి సిరిసిల్ల టీహబ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జనవరి 26న టీ హబ్ కో ఆర్డినేటర్ రాంప్రసాద్ జ్ఞాపికను స్వీకరించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాదపూర్వకంగా కలవడంతో వారిని అభినందించారు. ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేసిన డాక్టర్లు, సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌లు డాక్టర్ సంతోష్, డాక్టర్ మురళీధర్‌రావు, డాక్టర్ మనీష్, డాక్టర్ విమల, డాక్టర్ శ్వేత, డాక్టర్ క్రాంతిరేఖ, కో ఆర్డినేటర్ రాంప్రసాద్, హారిక, జనార్దన్, సత్యనారాయణ, శ్వేత, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఆందోళన

గంభీరావుపేట, ఫిబ్రవరి 3: గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద శనివారం ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆటో కార్మికులు పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. కామారెడ్డి- సిద్దిపేట ప్రధాన రహదారిపై ఆందోళన చేయడంతో రాకపోకలు కొద్దిసేపు స్తంభించిపోయాయి. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యంతో ఆటో కార్మికుల కటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైనాన్స్‌ల్లో అప్పుచేసి ఆటోలు కొనుగోలు చేశామని, ఆటోలు నడవక ఫైనాన్స్ డబ్బులు కట్టలేక పోతున్నామన్నారు. హైదరాబాద్‌లో ఆటో తగులబెట్టిన కార్మికుడికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఎంపీ, సర్పంచ్ ఎన్నికలకు ముందే ఆటో కార్మికులకు ప్రభుత్వం శుభవార్త చెప్పాలని, లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఆదర్శ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఇబాదుల్లాఖాన్, ఉపాధ్యక్షుడు ద్యానబోయిన రాజు, కార్యదర్శి భానుచందర్, ఆటో యూనియన్ నాయకులు గుడికాడి మహేష్, శంకర్, రమేష్, రాజేష్, ఖలీల్ ఉన్నారు.



ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



ట్రోఫీ అందజేస్తున్న న్యాయమూర్తులు

వేములవాడ, ఫిబ్రవరి 3: వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల- వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యుల మధ్య శనివారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్ బ్యాటింగ్ చేసి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ బౌలింగ్ చేసి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన వేములవాడ న్యాయవాదుల జట్టు 15 ఓవర్లలో 101 పరుగులకు ఆల్ అవుటైంది. సిరిసిల్ల న్యాయవాదుల జట్టు ఆటగాళ్లు 8 ఓవర్లలోనే 102 పరుగులు చేసి విజయం సాధించారు. 47 పరుగులు చేసిన కీసరి శ్రీనివాస్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నారు. విజేతలకు న్యాయ మూర్తులు రవీందర్, ప్రవీణ్ బహుమతులు అందజేశారు. ఏజీపీ గుడిసె సదానందం, వేములవాడ, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు పెంట రాజు, కోడి లక్ష్మణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నమనేని రమేష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చెన్నమనేని రమేష్

వేములవాడ, ఫిబ్రవరి 3: మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ జన్మదిన వేడుకలు శనివారం వేములవాడలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తల ఆశీస్సులతో తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించానని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటానని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌లు రామతీర్థపు మాధవి, జిందం కళ, నాయకులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు షీటీమ్‌లు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 3: మహిళలు, బాలికల రక్షణ కోసం షీటీంలు పని చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లాలో నెలరోజులుగా మహిళలు, బాలికల వేధింపులపై జరిగిన సంఘటన వివరాలను వెల్లడించారు. ఎలాంటి సమస్య ఉన్నా మహిళలు, యువతులు నిర్భయంగా పోలీసలను సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రద్దీ ప్రాంతాల్లో షీటీమ్ సిబ్బంది మఫ్టీలో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా వేధింపులకు గురైతే షీటీమ్ నంబరు 8712656425 ఫోన్ చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనపుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫొటోలు, వీడియోలను పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆకతాయిలు మహిళలను, యువతులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్థంలేని విమర్శలు చేస్తే ఉరుకోం

ముస్తాబాద్, ఫిబ్రవరి 3: అర్థం లేని విమర్శలు చేస్తే ఉరుకునేది లేదని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజక వర్గ పర్యటనపై కొందరు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సిరిసిల్లలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో కుటుంబ సభ్యుల మాదిరిగా సన్మానం చేయడానికి వచ్చిన కొంత మందిని దూరంగా ఉండాలని సూచిస్తే దానిని తప్పుగా షోషల్ మీడియా ద్వారా చూపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, పెద్దిగారి శ్రీనివాస్, గుండెల్లి శ్రీనివాస్, తోట ధర్మేందర్, జంగ రాజు, తలారి నర్సింలు, ఏదునూరి భాను, మిరుదొడ్డి భాను, దీటి నర్సింలు, తాళ్ల విజయ్‌రెడ్డి, బుర్ర రాములు, కొండల్‌రెడ్డి, వేముల సత్యనారాయణ, సారగొండ రాంరెడ్డి శీల ప్రశాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మన్‌మాదిగ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండలం గజసింగవరంలో శనివారం ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ వర్గీకరణ బిల్లుకు అనుకూలంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కుల గణనకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడం శుభ పరిణామమన్నారు. ఈ నెల 6న సుప్రీం కోర్టులో ఏబీసీడీల వర్గీకరణపై విచారణ జరుగుతున్న క్రమంలో మాది గ, మాదిగ ఉపకులాలు ఏకతాటిపై వచ్చి ఐక్యతను చాటుకోవాలన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటవ ఫలితంగా పిల్లల భవిష్యత్ ఫలాలను సాధించుకోబోతున్నామన్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, కో కన్వీనర్ నేరాల శ్రీనివాస్ ఉన్నారు.

సౌదీలో బండపల్లివాసి మృతి

చందుర్తి, ఫిబ్రవరి 3: జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ నిరుపేద మృతి చెందడం చందుర్తి మండలంలోని బండపల్లిలో విషాదం నింపింది. గ్రామా నికి చెందిన పోతుగంటి భూమయ్య (46) వలస కార్మికుడు గుండెపోటుతో శుక్ర వారం గల్ఫ్‌లో మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం నిరుపేద కుటుం బానికి చెందిన భూమయ్య బతుకు దెరువు కోసం ఐదేళ్లుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. మూడు నెలల క్రితం స్వగ్రామం వచ్చి 15 రోజుల క్రితమే సౌదీ అరేబియా వెళ్లాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా గుండెపోటు వచ్చింది. సహచరులు వెంటనే ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహన్ని తీసుకురావడానికి ప్రభుత్వం సహకారం అందించాలని బంధువులు కోరుతున్నారు.

సడక్ బంద్‌ను విజయవంతం చేయాలి

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక కర్షక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ సడక్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16న తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి పట్టణంలోని చెక్కపెల్లి బస్టాప్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముక్తికాంతం అశోక్, గుర్రం అశోక్, గూరిజల శ్రీధర్, చిలుక బాబు, మామిళ్ల పర్శరాములు తదితరులు ఉన్నారు.

బీఐఎస్ ప్రమాణాలపై అవగహన సదస్సు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 3: వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో భారతీయ ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని ప్రమాణాల ఆవశ్యకతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. బీఐఎస్ సంస్థ రిసోర్స్ పర్సన్ గిరిధారి ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతీయ ప్రమాణాల సంస్థ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను సవివరంగా తెలిపింది. పాఠశాలలు, కళాశాలలో స్టాండర్స్ క్లబ్స్ నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక విజ్ఞాన యాత్రలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్, అధ్యాపకులు ప్రభాకరాచారి, కృష్ణ మనోహర్ ఉన్నారు.

బావుసాయిపేటలో ఉచిత మెగా పశు వైద్య శిబిరం

కోనరావుపేట, ఫిబ్రవరి 3: కోనరావుపేట మండలం బావుసాయిపేటలో శనివారం కరీంనగర్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సందర్భంగా పశువుల గర్భకోశ వ్యాధి చూడి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణ అభివృద్ధి జిల్లా పరిషత్ అభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి డాక్టర్ జి.శ్రీధర్, మండల పశు వైద్యాధికారి అంజిరెడ్డి, పశువైద్య సిబ్బంది ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు స్థల పరిశీలన


వేములవాడ రూరల్, ఫిబ్రవరి 3: వేములవాడ గురుకుల పాఠశాలకు మర్రిపల్లిలో కేటాయించిన స్థలాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎండీ.సర్వర్ మియా శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ఏ. రాజేష్, ఉపాధ్యాయులు పూర్ణచందర్, ఉస్మాన్ షా ఖాన్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చందుర్తి, ఫిబ్రవరి 3: చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఏరెడ్డి రాజిరెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నాయకులు దమ్మ అంజయ్య, పోతరాజు నగేష్, కొత్త శ్రీనివాసరెడ్డి, మహేందర్, రాజిరెడ్డి, రాజయ్య, దేవారెడ్డి ఉన్నారు.

బాల్యం నుంచే సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 3 : బాల్యం నుంచే సైన్స్‌పై అవగామన కలిగి ఉండాలని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సినారె జిల్లా గ్రంథాలయ సంస్థలో శనివారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ మాట్లాడారు. సమాజ అభివృద్ధి సైన్స్ మీదా ఆధారపడి ఉందన్నారు. ప్రజల్లో నెలకొన్న అంధవిశ్వాసాలను నిర్మూలించాలన్నారు. నేడు సమాచారం తెలుసుకోవడానికి రకరకాల వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. అయినా విద్యార్థులు పుస్తకాలు చదివే అలవాటును మరిచిపోవద్దన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి సైన్స్ పట్ల అభిరుచి పెంపోందించుకోవడానికి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందన్నారు. జిల్లా డిప్యూటీ సీఈవో వంగ గీత మాట్లాడుతూ బాల్యం నుంచి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, హేతుబద్ధంగా ఆలోచించినప్పుడే మూఢనమ్మకాలను నిర్మూలించే అవకాశం ఉంటుందని అన్నారు. నిత్యం సైన్స్ విషయాలు తెలుసుకోవడంతోపాటు శాస్త్రీయ ఆచరణతో ముందుకెళ్లాలన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక స్పృహను కల్గి ఉండాలన్నారు. అనంతరం జిల్లా లో ప్రభుత్వ స్కూల్ తెలుగుమీడియం నుంచి జిల్లా పరిషత్ ఫాజుల్‌నగర్, ఇంగ్లీష్ మీడియం నుంచి జిల్లా పరిషత్‌బందనకల్, ప్రైవేటు స్కూల్ విభాగం నుంచి ఎల్లారెడ్డిపేట విజ్ఞాన్ స్కూల్ రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సీరామరాజు, జిల్లా అధ్యక్షుడు గుర్రం అంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్యారం లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి ఎం.కిషన్, కట్కూరిరాజు, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్, చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల నిర్వాహకులు మధు, విజయ్, షీలాకుమార్, శ్రీరాములు, అనిల్‌కుమార్, గంగయ్య, దూససంతోష్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డీఈవో

పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులు కష్టపడి చదవాలని డీఈవో రమేష్‌కుమార్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు డీఈవో రమేష్‌కుమార్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోనూ రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపాలన్నారు. అకాంక్షించారు. అనంతరం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన విద్యార్థులు

జిల్లా పరిషత్ పాఠశాలలు ఇంగ్లీష్ మీడియం విభాగం నుంచి జి.విఘ్నేష్(లింగన్నపేట), వైష్ణవి (వట్టిమల్ల), శ్యాంచరణ్(వెల్జిపూర్), తెలుగు మీడియం విభాగం నుంచి అజయ్ (మానాల), సాయిశ్రీజ (రాచర్ల తిమ్మాపూర్), తేజస్విని (సుద్దాల), సంజన (సముద్రలింగాపూర్), రెసిడెన్షియల్ పాఠశాలల విభాగం నుంచి పర్ణిక ,పావని (మోడల్‌స్కూల్ రహీంఖాన్‌పేట), వైష్ణవి (మోడల్ స్కూల్ గంభీరావుపేట) రాష్ట్ర స్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్‌లకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి సీహెచ్ పద్మజ, ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ, గాంధీ గ్లోబల్ ప్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ప్రతినిధి శ్రీరాములు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రెడ్డిరవి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.